# స్పీకర్ కార్యాలయంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం



## ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై కీలక ఆదేశాలు

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హతపై అసెంబ్లీ స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేశారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టి... తెలంగాణ ప్రభుత్వం, ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.



**తెలంగాణ బ్యూరో రవీంద్ర , మార్చి 04(డైలీ రిపోర్ట్):**

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హతపై అసెంబ్లీ స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేశారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టి... తెలంగాణ ప్రభుత్వం, ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం, స్పీకర్ కార్యాలయం, తెలంగాణ శాసనసభ కార్యదర్శి, భారత ఎన్నికల సంఘం, ఫిరాయించిన శాసనసభ్యుల నుండి స్పందనలు కోరింది. ఇందుకు సంబంధించిన తదుపరి విచారణను మార్చి 25వ తేదీకి వాయిదా వేసింది.ఇక, ఈ పిటిషన్లపై ఫిబ్రవరి 10న జరిగిన గత విచారణలో... ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడానికి ఎంత సమయం పడుతుందో తెలుపాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, శేఖర్ నాఫ్డేలను సుప్రీం కోర్టు అడిగింది. అనంతరం విచారణను ఫిబ్రవరి 18న విచారణకు వాయిదా పడింది. అయితే న్యాయమూర్తులు రాజ్యాంగ ధర్మాసనంలో బిజీగా ఉండటంతో... తదుపరి మార్చి 4కి వాయిదా వేశారు.ఇక, తెలంగాణలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరారు. తమ పార్టీ టిక్కెట్లపై ఎన్నికైన ఎమ్మెల్యేలు తెల్లంవెంకటరావు, కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారని.. మూడు నెలలు గడిచినప్పటికీ శానసన స్పీకర్ ఎలాంటి చర్య తీసుకోవడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివేకానంద, పాడి కౌశిక్ రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి కూడా ఈ విషయంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శాసనసభ స్పీకర్ ఆలస్యం మరింత మంది ఎమ్మెల్యే ఫిరాయింపులకు దారితీస్తుందని వారు వాదించారు. అయితే ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్.. నాలుగు వారాల్లోపు అనర్హత పిటిషన్లను విచారించడానికి షెడ్యూల్‌ను నిర్ణయించాలని శాసనసభ స్పీకర్‌ను ఆదేశించింది. ఈ ఆదేశాలను తెలంగాణ శాసనసభ ద్వారా స్పీకర్ హైకోర్టు డివిజన్ బెంచ్ ముందు అప్పీల్ చేశారు.ఈ క్రమంలోనే గతేడాది నవంబర్‌లో హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలను డివిజన్ బెంచ్ పక్కనబెట్టింది. స్పీకర్ సహేతుకమైన సమయంలో చర్య తీసుకోవాలని.. నిర్దిష్ట కాలక్రమాన్ని నిర్వచించకుండా వదిలివేసింది.అనర్హత పిటిషన్లను విచారించేటప్పుడు.. స్పీకర్ పెండింగ్ వ్యవధి, రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ఉద్దేశ్యం అసెంబ్లీ పదవీకాలాన్ని పరిగణనలోకి తీసుకోవాలని హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది పిటిషన్లు దాఖలు చేసి ఇప్పటికే నాలుగున్నర నెలలు గడిచిపోయాయని.. నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని డివిజన్ బెంచ్ పేర్కొంది.అయితే హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పును బీఆర్ఎస్ నేతలు సుప్రీం కోర్టులో సవాలు చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లపై సత్వర నిర్ణయం తీసుకునేలా జోక్యం చేసుకోవాలని సుప్రీంకోర్టును కోరారు. మరొక పిటిషన్‌లో మరొక పిటిషన్ పార్టీ ఫిరాయించిన మరో ఏడుగురు శాసనసభ్యులకు సంబంధించి దాఖలైంది.